నిధులున్నా పనులెందుకు చేయరు?

- అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా మెలగాలి
- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వీలుగా వివిధ పద్దుల కింద కోట్లాది నిధులు కేటాయిస్తున్నా.. పనులను ప్రారంభించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. బుధవారం ఎంపీపీ స్రవంతి అధ్యక్షతన జరిగిన పెద్దపల్లి మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమావేశానికి సర్పంచ్, ఎంపీటీసీలు, అధికారులు గైర్హాజరు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో పూర్తి చేసిన పనులకు శిలాఫలకాలు వేయించాలని పీఆర్ ఏఈ మదన్‌మోహన్‌కు సూచించారు. అంతకుముందు విద్యుత్ అధికారులు పంచాయతీల నుంచి బిల్లులను వసూలు చేయడంపై చూపుతున్న శ్రద్ధ సమస్యల పరిష్కారం చూపడం లేదని సర్పంచులు బాపయ్య, స్వప్న ఆరోపించారు. నిర్మాణాలు పూర్తి చేసినా సకాలంలో బిల్లులు రావడం లేదని కనగర్తి ఎంపీటీసీ ఎడెల్లి శంకర్ ఆరోపించారు. పెద్దపల్లిలో ఎస్సీ విద్యార్థిని, విద్యార్థినులకు కాలేజీ హాస్టళ్లు మంజూరయ్యాయని వాటిని త్వరలోనే ప్రారంభిస్తామని సోషల్ వెల్ఫేర్ అధికారి తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ రామ్మూర్తి, విండో చైర్మన్లు నర్సింహారెడ్డి, చంద్రారెడ్డి తో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏం ఉద్ధరించారని గ్రామాల్లో తిరుగుతుండ్రు..

ఓదెల: ఏం ఉద్ధరించారని కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో తిరుగుతుండ్రని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో అప్రకటిత కరెంట్ కోతలు, కాలిన కరెంట్ మోటార్లు, ఆత్మహత్యలతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కునారపు రేణుకదేవి, రైతుసమన్వయసమితి మండల చైర్మన్ కావటి రాజు, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ బొడకుంట చిన్నస్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పాలనలోనే గీత కార్మికులకు మేలు

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- పాదయాత్రలో పలువురి వినతులు


గీత కార్మికుల సమస్యలు వింటున్న భట్టి విక్రమార్క

పెద్దపల్లిరూరల్: గీతకార్మికులకు వైఎస్సార్ పాలనలో మేలు జరిగిందని సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం పెద్దపల్లి మండలంలోని హన్మంతునిపేటలో గీతకార్మికులను కలిసిన భట్టి విక్రమార్క వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర రాంపల్లి, జగన్నాథపురం, మారెడుగొండ, దావన్నపల్లి గ్రామాల మీదుగా సాగింది. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు యాట మల్లారెడ్డి, మాజీ జెడ్పీటీసీ యాట దివ్య, నాయకులు పాదయాత్రలో పాల్గొన్నారు.

దళిత జర్నలిస్టులకు దళితబంధు వర్తింపజేయాలి

దళిత జర్నలిస్టులకు దళితబంధు పథకం అమలులో ప్రాధాన్యతనిచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ఆరెల్లి మల్లేశ్ కోరారు. మండలంలోని హన్మంతునిపేట పాదయాత్రలో భట్టివిక్రమార్కను కలిసి వినతిపత్రం అందించారు.

ఉద్యమకారులకు న్యాయం చేయాలి

కమాన్‌పూర్: తెలంగాణ ఉద్యమకారులకు తగిన న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల పోరం సభ్యులు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కకు వినతి పత్రాన్ని అందజేశారు. ఉద్యమకారుల సమస్యలను అసెంబ్లీలో చర్చించి, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గుండేటి ఐలయ్య, నూనే రాజేశం, మాడ నారాయణరెడ్డి, బత్తుల శంకర్, దబ్బెట చంద్రకళ, కళాధర్‌రెడ్డి, మల్లయ్య ఉన్నారు.

క్లుప్తంగా

అగ్నిప్రమాదాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్

కోల్‌సిటీ: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని వ్యాపార కూడళ్లలో బుధవారం ఫైర్ ఆఫీసర్ ఆర్.సత్యనారాయణ అగ్ని ప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చెత్తతో కృత్రిమంగా మంటను పుట్టించి మిస్ట్ బుల్లెట్ ఫైర్ గన్ రసాయనంతో మంటలను ఆర్పి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యాపారస్తులు ఇ.సత్యనారాయణ, బి. రామస్వామి, ఎ.శ్రీనివాస్, డి.తిరుపతిగౌడ్, కె.సురేందర్ రెడ్డి, టి.రాజయ్య, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మంథని: అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుపై మంథని ఆస్పత్రి అభివృద్ధిపై ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం మంథని సామాజిక వైద్యశాలను సందర్శించిన అనంతరం మాట్లాడారు. ప్రభుత్వం నుంచి రెండేళ్లుగా నిధులు రాలేదన్నారు. 2009 నుంచి 50 పడకల ఆస్పత్రి ఉండి మరి ఇప్పుడు 25 పడకలు ఎందుకు అయిందో చెప్పాలన్నారు. శానిటేషన్ సిబ్బందికి ఆరు మాసాలుగా వేతనాలు రావడంతో లేదని, పెద్దపల్లి, గోదావరిఖని ఆస్పత్రుల్లో రూ. 11,500 చెల్లిస్తే మంథనిలో రూ. 5వేలు చెల్లిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ మంథని డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం, బ్లాక్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేల్పుల రాజు, మంథని మున్సిపల్ కౌన్సిలర్ పెండ్రు రమాదేవి, ఒడ్నాల శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్,తదితరులు ఉన్నారు.

పన్నులు చెల్లించని హోర్డింగ్‌లు తొలగింపు


హోర్డింగ్‌లు తొలగిస్తున్న బల్దియా సిబ్బంది

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థకు గత మూడేళ్లుగా ప్రకటనల పన్ను చెల్లించక పోవడంతో, బుధవారం ఆయా సంస్థలకు చెందిన హోర్డింగ్‌లను టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. ఇప్పటికైనా మిగిలిన హోర్డింగ్ సంస్థల బకాయిదారులు వెంటనే పన్ను చెల్లించాలని, లేనిపక్షంలో వారి హోర్డింగ్‌లను కూడా తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీపీ

ధర్మారం: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ సూచించారు. మండలంలోని బొట్లవనపర్తి, నర్సింహులపల్లి, కానంపెల్లి, పైడిచింతలపల్లి, రచ్చపల్లి, దొంగతుర్తి గ్రామాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులకు ధాన్యాన్ని విక్రయించరాదన్నారు. కార్యక్రమంలో సహకారసంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు పాకాల రాజయ్య, సర్పంచ్ రెడపాక ప్రమీల, ఎంపీటీసీ మోతె సుజాత, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మిట్ట తిరుపతి, సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

కులవృత్తులకు చేయూతనిస్తోన్న సీఎం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోరుకంటి చందర్


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గోదావరిఖని: సీఎం కేసీఆర్ కులవృత్తులకు చేయూతనిస్తూ వారిని అగ్రభాగాన నిలిపే ప్రయత్నం చేస్తున్నారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం తిలక్‌నగర్‌లోని విశ్వం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరై ప్రసంగించారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తాను రాష్ట్రం కోసం రామగుండం తరుపున ముందుండి పోరాటాలు చేశానని, ప్రజా సేవ చేయాలనే గొప్ప సంకల్పంతో ఎమ్మెల్యేగా గెలిచి ఈప్రాంత అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నానన్నారు. కొంతమంది విపక్షాల నాయకులు తనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ అసత్యపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నారాయణదాసు మారుతి, రాకేశ్, భాస్కర్, చెలుకలపల్లి శ్రీనివాస్, మెతుకు దేవరాజ్, జేవీరాజు, తోడేటి పాల్గొన్నారు.

దళారుల చేతుల్లో రైతులు మోసపోవద్దు

పాలకుర్తి: రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుని మద్దతు ధర పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మండలంలోని పుట్నూర్, గుడిపల్లి, జయ్యారం గ్రామాల్లో మేడిపల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని, సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగలా మార్చారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చింతకింది నర్సమ్మ, కొప్పు పుష్పలత, రావుల శారద, పుట్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం రాజయ్య, మేడిపల్లి సొసైటీ చైర్మన్ ప్రభాకర్, ఉప సర్పంచ్‌లు కొప్పు ప్రసాద్, గొల్లపల్లి విష్ణుగౌడ్, మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు భవనం పరిశీలన

కోల్‌సిటీ: రామగుండంలో కొత్తగా మంజూరైన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి, అనువైన భవనం కోసం బుధవారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఖాళీ గదులను ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించారు. బల్దియా కార్యాలయంలో నిర్వహించిన కోర్టు ప్రాంగణంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిర్వహించడానికి అనుకూలంగా ఉంటుందని భావించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిచనున్నట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెల్యేతో నగర మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు తదితరులు ఉన్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టుతోనే రాష్ట్ర ప్రజలకు నీళ్లు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గోదావరిఖని: ఎల్లంపల్లి ప్రాజెక్టుతోనే హైదరాబాద్, సిద్దిపేట్, గజ్వేల్ ప్రజలకు తాగునీరందుతోందని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మహంకాళి స్వామి అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఎల్లంపల్లి ప్రాజెక్టుతో రాష్ట్రం సస్యశ్యామలమైందని అసెంబ్లీలో ప్రకటిస్తే, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాత్రం ప్రాజెక్టు దండగ అనడం అర్థం కాలేదన్నారు. సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్కపై అక్కసును వెళ్లగక్కడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మోకాళ్ల మీద యాత్ర చేసినా కాంగ్రెస్‌పార్టీ కి డిపాజిట్ దక్కదని ఎమ్మెల్యే అనడాన్ని తప్పుపట్టారు. రాబోయే ఎన్నికల్లో ఎవరికి డిపాజిట్ ఇస్తారో ప్రజలే నిర్ణయిస్తారన్నారు. సంతాప సభలు పెట్టి ఓట్లు దండుకునే తీరు బీఆర్ఎస్ నాయకులకే తెలుసన్నారు. మెడికల్ కళాశాల కోసం సింగరేణి సంస్థ రూ. 500 కోట్లు ఇస్తే కార్మిక కుటుంబాలకు కనీసం మిషన్ భగీరథ నీరు ఇప్పించలేకపోతున్నారని విమర్శించారు. సమావేశంలో నాయకులు రవికుమార్, ముస్తాఫా, ముదాం శ్రీనివాస్, తిప్పారపు శ్రీనివాస్, యుగేందర్, దేవేందర్‌రెడ్డి, పోశం తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వండి


అమరవీరుల స్తూపం వద్ద సంతకాల సేకరణ

పెద్దపల్లిరూరల్: జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్లు, ఇళ్ల స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. జర్నలిస్టులుగా పనిచేస్తున్న వారు ఎన్నో సమమస్యలను ఎదుర్కొంటున్నారని, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలను, ఇళ్లను ఇప్పించాలని జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ కోరారు. నాయకులు చంద్రమౌళి, అశోక్, వివేక్, సుదర్శన్, తిరుపతిరెడ్డి, సాబీర్‌పాష, రామదాసు, శ్రీధర్, గోపికృష్ణ, వెంకటేశ్, దేవేందర్ తదితరులున్నారు.

మాజీ ఎమ్మెల్యే 'గీట్ల' కు ఘన నివాళి


గీట్ల సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న కుటుంబ సభ్యులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డి వర్ధంతిని బుధవారం నిర్వహించారు. కూనారం క్రాస్‌రోడ్డు లోని గీట్ల ముకుందరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో పాటు గీట్ల తనయుడు రాజేందర్‌రెడ్డి, దండ నర్సింహారెడ్డి, వివిధ పార్టీల నాయకులు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పెద్దపల్లి నియోజకవర్గ ప్రజల గుండెల్లో గీట్ల సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాడని వక్తలు కొనియాడారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి, విండో చైర్మన్ నర్సింహా రెడ్డి,కాంగ్రెస్ పార్టీ పట్టణఅధ్యక్షుడు బి.సురేశ్ గౌడ్ నాయకులు అన్నయ్యగౌడ్, బండి సునీల్, మంథని నర్సింగ్, పాల్గొన్నారు.

ఎలిగేడు: నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా గీట్ల ముకుందరెడ్డి పనిచేశారని గీట్ల అభిమానులు అన్నారు. ఎలిగేడు మండలకేంద్రంలో గీట్ల వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. ఎలిగేడు ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

కాల్వశ్రీరాంపూర్: గీట్ల ముకుంద రెడ్డి వర్ధంతి బుధవారం ఆయన స్వగ్రామం కూనారంతోపాటు వెన్నంపల్లి, కాల్వశ్రీరాంపూర్, పెగడపల్లి గ్రామాల్లో ఆయన కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు ఘన నివాళి అర్పించారు. కూనారంలో గీట్ల సమాధి వద్ద కుమారుడు రాజేందర్ రెడ్డి, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో పెద్దరాతుపల్లి సర్పంచ్ కొమురయ్య గౌడ్, పందిల్ల ఎంపీటీసీ రావి సదానందం, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీబీ బాధితులు పౌష్టికాహారం తీసుకోవాలి


పౌష్టికాహారం అందిస్తున్న అధికారులు

జూలపల్లి: టీబీ బాధితులు పౌష్టికాహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా మందులు వాడుకోవాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు. కరీంనగర్ చెందిన పొల్సాని శ్రీధర్‌రావు- స్రవంతి దంపతులు తమ పెళ్లి రోజు సందర్భంగా అందించిన సరుకులను పదిమంది టీబీ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ టీబీ మందులతో పూర్తిగా నయమవుతుందని సూచించిన విధంగా వాడాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌టీఎస్ సురేందర్, ఎల్‌టీ కిరణ్‌కుమార్, హెచ్‌ఎస్ వసంత, ఎస్ఎన్ ఫాతిమా, స్వప్న, ఫార్మాసిస్ట్ రమేష్, అనంతరావు, సిబ్బంది ఉన్నారు.

ఫిజియోథెరపీని వినియోగించుకోండి

సుల్తానాబాద్: అర్హులైన దివ్యాంగులు ఫిజియోథెరపీని వినియోగించుకోవాలని ఫిజియోథెరపీ డాక్టర్ శంకర్ కోరారు. సుల్తానాబాద్ ఎంఆర్సీ భవనంలో బుధవారం దివ్యాంగుల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నిత్యం చేయాల్సిన వ్యాయామంతో పాటు సూచనలు విద్యార్థులకు చేశారు. ఏడాది నుంచి 18 ఏళ్ల లోపు ఉన్న ప్రతీ విద్యార్థి ఈ క్యాంపును వినియోగించుకోవచ్చని ప్రతి బుధవారం ఎంఆర్సీలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీచర్ కరుణాశ్రీ తదితరులు ఉన్నారు.

ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

రామగుండం: రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటలో ప్రధాన రహదారిపై బుధవారం రాయదండి ఎంపీటీసీ కొలిపాక శరణ్య తన సొంత నిధులను వెచ్చించి స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. గ్రామంలో మూడు చోట్ల ఏర్పాటు చేసినట్లు ఎంపీటీసీ భర్త మధుకర్‌రెడ్డి తెలిపారు. స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేయడంపై బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పుట్ట శ్రీనివాస్, తమ్మనవేణి శ్రీనివాస్ తదితరులు ఎంపీటీసీని అభినందించారు.

అంగన్‌వాడీ టీచర్లకు సన్మానం

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని నాగేపల్లి అంగన్‌వాడీ టీచర్లు సుగుణభాయ్, లావణ్యను సర్పంచ్ కొండవేన ఓదెలు బుధవారం ప్రభుత్వ పాథమిక పాఠశాలలో సన్మానించారు. గ్రామంలో మూడు నుంచి ఐదేళ్ల లోపు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినందుకు టీచర్లను సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో పల్లెపాటి సంపత్‌రావు, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, సీఆర్పీలు మమత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉండాలి

మంథని: బాలికలు మానసిక ఒత్తిడికి గురికాకుండా పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని మంథని జెడ్పీటీసీ తగరం సుమలత అన్నారు. బుధవారం మంథనిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆచార్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలికల వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శానిటరీ నాప్కిన్‌లు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శారద, ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ జువ్వాజి, రాజేష్, ఖాజా అలీమోద్దీన్ కొమిరిశెట్టి రమేష్, లత, శ్రీదేవి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ స్వరూప పాల్గొన్నారు.

చెక్కు అందజేత

జూలపల్లి: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి అన్నారు. రంజాన్ సందర్భంగా ఇఫ్తార్‌విందుకు రూ. 5 వేల చెక్కును ఎంపీడీవో కార్యాలయంలో కోఆప్షన్ సభ్యుడు లాల్‌మహ్మద్‌కు అందజేశారు.కార్యక్రమంలో తహసీల్దార్ జయశ్రీ, డీటీ అబూబాకర్, కుమ్మరికుంట ఎంపీటీసీ మల్లేశ్ యాదవ్, ఇమామ్ తదితరులు ఉన్నారు.

అభినందన

కోల్‌సిటీ: ప్రతి ఒక్కరూ మరణానంతరం నేత్ర దానం చేయడానికి ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు పిలువునిచ్చారు. గోదావరిఖని జీఎం కాలనీకి చెందిన పెసరి శంకర్(54) అనే సింగరేణి కార్మికుడు, ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు ఐ బ్యాంక్‌కు దానం చేశారు. ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నేత్రదాత సంస్మరణ సభను ఫౌండేషన్ ప్రతినిధులు నిర్వహించారు. బాధిత కుటుంబ సభ్యులకు అభినందన పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ ప్లాంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నూక రమేశ్, సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు భీష్మాచారి, ఫౌండేషన్ ప్రతినిధులు, మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు

కాల్వశ్రీరాంపూర్: ప్రభుత్వం కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తద్వారా ప్రజా సంక్షేమంలో దేశంలోనే అగ్రగామిగా మన రాష్ట్రం మార్గదర్శకంగా నిలిచిందని ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, తహసీల్దార్ అనుపమ రావు అన్నారు. పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని బుధవారం మండలంలోని మల్యాల, వెన్నంపల్లి, పెగడపల్లి, కూనారం, పందిల్ల తదితర గ్రామాల్లో ముస్లింలకు ప్రభుత్వం తరపున నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐలు వైష్ణవి, ఉదయశ్రీ, సర్పంచులు, ఎంపీటీసీలు, ముస్లింలు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో సత్తా చాటిన ట్రినిటీ విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటీ డిగ్రీ, పిజి కాలేజీ విద్యార్థులు డిగ్రీ ఫలితాల్లో సత్తాచాటారు. శాతవాహన యూనివర్సిటీ వెల్లడించిన సెమిస్టర్ 1లో ఉత్తమ ప్రతిభను కనబర్చి మంచి మార్కులు సాధించారు. కామర్స్ విభాగంలో బొమ్మ సహజ 9.3, బండి స్రవంతి 9.15, హారిక 9.06, అడిచెర్ల రుచిత 9.02, దాసరి వంశీకృష్ణ 8.99 తన్వీర్8.69 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోదావరిఖనిటౌన్: నేడు పీజీ సెంటర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల పవర్‌హౌస్‌కాలనీ ఫీడర్‌లో గల సప్తగిరికాలనీ, జై భీమ్ నగర్, ఐబీ కాలనీ, బాపూజీనగర్, ప్రియాంకనగర్ ఏరియాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎ.దేవస్వామి తెలిపారు. వినియోగదారులు సహరించాలని కోరారు.

నేటి నుంచి ఆత్మీయ సమ్మేళనాలు

జూలపల్లి: మండలంలో నేటి నుంచి గ్రామ స్థాయిలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు జూలపల్లి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు కంది చొక్కారెడ్డి తెలిపారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి లోని శానగొండ, జీలకుంట, పొత్కపల్లి గ్రామాల్లో ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. జమ్మికుంట, కాల్వశ్రీరాంపూర్ వైపునకు వెళ్తున్న వాహనాలను తనిఖీ చేసి సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు.

సంక్షిప్త వార్తలు

కంటి వెలుగు శిబిరం సందర్శన

జ్యోతినగర్: కార్పొరేషన్ 23వ డివిజన్ అన్నపూర్ణ కాలనీలోని చిలుకలయ్య ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్ సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ కంటి వైద్య పరీక్షలు చేసుకునేందుకు వీలుగా వైద్య సిబ్బంది శిబిరం గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. శిబిరంలో డాక్టర్ చేరాలు, హెల్త్ సూపర్‌వైజర్ సమ్మయ్య, ప్రవళిక, హరీష్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

సుల్తానాబాద్‌రూరల్: కంటి వెలుగును అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బాలాజీరావు సూచించారు. సుల్తానాబాద్ మండలం మియ్యాపూర్‌లో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొయ్యడ స్వప్న, ఎంపీడీవో శశికళ, ఎంపీటీసీ ఫక్కిర్ యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

కోల్‌సిటీ: నగరపాలక సంస్థ 44వ డివిజన్ రమేశ్‌నగర్‌లో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని డివిజన్ కార్పొరేటర్ ఎండీ ముస్తఫా ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో నాయకులు గట్ల రమేశ్, పంజా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రాములపల్లిలో 152 మందికి కంటి పరీక్షలు

ఎలిగేడు: మండలంలోని రాములపల్లిలో కంటి వెలుగులో భాగంగా బుధవారం 152 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 21 మందికి కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా, కంటి వెలుగు క్యాంపు మెడికల్ ఆఫీసర్ స్వప్న, సర్పంచ్ సౌమ్య, ఉపసర్పంచ్, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

ఎలిగేడు: మండలంలోని నారాయణపల్లి, లాలపల్లి గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, సర్పంచ్ మాడ కొండాల్ రెడ్డి, నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కమాన్‌పూర్: రామగిరి మండలానికి చెందిన పొన్నం శ్రీకాంత్ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా, బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు మోలుమూరి శ్రీనివాస్, తొట్ల రాజు, రేణికుంట్ల విజయ్, కుమ్మరి నరేశ్, గణేశ్ తదితరులున్నారు.